క్లుప్తంగా

చురుగ్గా పింఛన్ల పంపిణీ



యండమూరులో వృద్ధురాలు రెడ్డి లక్ష్మీకాంతానికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వనం రేవతి

కరప: మండల పరిధిలోని 23 గ్రామాల్లో బుధవారం 7,833 మందికి (67.35 శాతం) పింఛన్లు రూ.2,13,88,500 పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. గ్రామాల్లో సిగ్నల్స్ లేకపోవడం, సర్వర్ సమస్యలు, కొందరు లబ్ధిదారులు లేక తదితర కారణాలతో కొందరికి పంపిణీ కాలేదని ఎంపీడీఓ తెలిపారు. గురు, శుక్రవారాల్లో నూరుశాతం పూర్తి చేయిస్తామని ఆయన చెప్పారు. ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. వేళంగి–1 గ్రామ సచివాలయంలో 81.56 శాతం, గొర్రిపూడి–2 గ్రామ సచివాలయం 78.94 శాతం, నడకుదురు గ్రామ సచివాలయం 78.78 శాతంతో పింఛన్ల పంపిణీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

పాలస్తీనాపై దాడిని ఆపండి

కాకినాడ సిటీ: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడిని ఆపాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కాకినాడ జీజీహెచ్ వద్ద ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహం బుధవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ నాయకులు జి.బేబీరాణి, సిహెచ్ రాజ్‌కుమార్, మలకా వెంకటరమణ, పలివెల వీరబాబు, పి.సూర్యారావు, పి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోనేరులో శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠ పూజలు చేస్తున్న కర్నాసుల తదితరులు

కరప: మండలం పెద్దాపురప్పాడులోని ఉమా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయానికి ఎదురుగా అభివృద్ధి చేసిన కోనేరులో బుధవారం శివపార్వతుల, విఘ్నేశ్వర, కుమారస్వామివార్ల విగ్రహాలు, 108 శివలింగాలను ప్రతిష్ఠించారు. ఇందుకోసం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు మంజూరు చేశారు. దాత మారేటి శ్రీనివాసరావు స్వామివార్ల విగ్రహాలను, 108 శివలింగాలను సమకూర్చగా, మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు దంపతులతో ఆలయ అర్చకుడు పండుస్వామి గణపతి పూజ, శాంతికళ్యాణం చేయించారు. కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేశారు. పీఏసీఎస్ మాజీచైర్మన్ బొండా సూర్యనారాయణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

బాలాజీచెరువు: ఈ నెల 14వ తేదీ నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను జేసీ ఇలక్కియాకు అవిష్కరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి 20వ తేదిన బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

కరప: మండలం వేళంగి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకవ్యక్తికి తీవ్రగాయాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం మేరకు వేళంగి గ్రామానికి చెందిన కురిమిల్లి సూర్యనారాయణ తోపుడుబండిపై దుస్తులు ఇస్త్రీచేస్తూ జీవిస్తుంటాడు. బుధవారం దుస్తులు సేకరించి వస్తుండగా హైస్కూలు సమీపంలో వెనుక నుంచి వచ్చిన మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూర్యనారాయణకు బలమైన గాయాలు కాగా జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతి జాడలపై అప్రమత్తంగా ఉండాలి



ఎల్ఐసీలో జరిగే అవినీతిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కరప: వ్యవస్థాగతంగా ఏమైనా అవినీతిజాడలు, ఇతర అక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని, అటువంటివి ఏమైనా తెలిస్తే వెంటనే కేంద్ర నిఘా సంస్థకు తెలియజేయాలని ఎల్ఐసీ మెయిన్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ ఎంఎస్ సుబ్రహ్మణ్యం కోరారు. నిఘా వారోత్సవాల్లో భాగంగా మండలం అరట్లకట్టలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎల్ఐసీ కార్యకలాపాలు గురించి, అవినీతి, అక్రమాలపై నిఘా సంస్థకు ఎలా ఫిర్యాదుచేయాలో ఆయన వివరించారు. ఎల్ఐసీ కాకినాడ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ రాఘవేంద్రరావు, డెవలప్‌మెంట్ ఆఫీసర్ బోడా సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్ రికార్డు ఇక పక్కా!

- ఈ ఏడాది రవాణా ట్రాక్టర్లకు జీపీఎస్
- ఆర్‌బీకే నుంచి మిల్లు వరకు జాప్యం లేకుండా ధాన్యం సరఫరా
- అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకే అంటున్న అధికారులు



కరప ఆర్‌బీకేకు జీపీఎస్ చేయించుకోవడానికి వచ్చిన ట్రాక్టర్లు

కరప: ఆలస్యం అమృతం విషం అన్నారు పెద్దలు. ఎప్పటి పని అప్పుడు నిర్ణీత కాలంలో జరిగిపోతే దానికి ఓ విలువ ఉంటుంది. లేదంటే నష్టమో, కష్టమో తప్పదు. ఉభయ తారకంగా రైతన్నకు కష్టం, ప్రభుత్వానికి నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం మిల్లుకు రవాణా చేసే క్రమంలో జరిగే అవకతవకలను అరికట్టేందుకు వాహనాలకు జీపీఎస్ అమర్చే ప్రక్రియ చేపట్టారు.

నిరీక్షణకు, అవకతవకలకు అడ్డుకట్ట

గతంలో ఆర్‌బీకే వద్ద ట్రక్ షీట్ రాసిచ్చినా ధాన్యం తీసుకెళ్లేందుకు వాహనదారులు రెండు, మూడు రోజులు ఆలస్యం చేసేవారు. ఆర్బీకే చేరువలో ఉన్న మిల్లును వదిలేసి పక్క మండలాల్లోని మిల్లులకు కూడా తీసుకెళ్తుండేవారు. దీంతో మిల్లుల వద్ద ధాన్యం బస్తాలను దిగుమతి చేసుకోవడంలో ఆలస్యమైందని, దూరం ఎక్కువైందని ఇతర కాణాలు చెప్పి, వాహన యజమానులు ట్రాన్స్‌పోర్టు చార్జీలు ఎక్కువగా వసూలు చేసేవారు. ట్రాన్స్‌పోర్టులో జరుగుతున్న అవకతవకలను పసిగట్టిన అధికారులు ఈ ఏడాది ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ అమర్చాలన్న నిబంధన తీసుకువచ్చారు. దీని వల్ల కళ్లం వద్ద ఎన్ని గంటలకు బయలుదేరింది, మిల్లు ఎంతదూరంలో ఉంది, అక్కడికి ఎన్ని గంటలకు వెళ్లిందీ వివరాలు సులువుగా గుర్తించే వీలుంటుంది. మిల్లు వద్దకు వెళ్లిన తర్వాత సదరు వాహనం నుంచి ధాన్యం బస్తాలు ఎంత సమయంలో దించారు, వేచి ఉండాల్సి వచ్చిందా అనేది ఈ జీపీఎస్ పరికరం ద్వారా తెలుసుకుంటారు. దీనివల్ల నిబంధనల మేరకు రవాణా చార్జీలు చెల్లించేందుకు వెసులుబాటు కలుగుతుంది. నియోజకవర్గం పరిధిలో కాకినాడ రూరల్ మండలంలోని 13 ఆర్‌బీకేలకు 8 చోట్ల, కరప మండలంలో ఉన్న 20 కేంద్రాల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఈ వాహనాలను ఏర్పాటు చేశాం. నియోజకవర్గం పరిధిలో 147 వాహనాలకు జీపీఎస్ చేశారు. వాహన యజమానుల నుంచి ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేశారు. వీటిని ఆర్‌బీకేల వద్ద అందుబాటులో ఉంచుతారు. రైతు నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని జీపీఎస్ చేసిన వాహనాల ద్వారా రైసుమిల్లులకు తరలించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రైతు వద్ద తీసుకున్న ధాన్యం కళ్లం నుంచి 8 కిలోమీటర్ల దూరం వరకు టన్నుకు రూ.260, ఆపైన 8–20 కిలో మీటర్ల దూరానికి రూ.7, 20–40 కిలో మీటర్ల దూరానికి రూ.6.50, 40–80 కిలో మీటర్లకు రూ.6, 80 కిలో మీటర్లకు పైబడి



కరపలో ట్రాక్టర్ స్టీరింగ్ వద్ద జీపీఎస్ పరికరం అమరుస్తున్న ఎంపీఓ రాజేష్

కరప మండలంలో 122 వాహనాలకు..

మండల పరిధిలోని 122 మంది వాహనదారులు ముందుకు రాగా వాకాడ, కరప, పెనగుదురు ఆర్‌బీకే వద్ద వారి నుంచి వివరాలు తీసుకుని, జీపీఎస్ చేశాం. ఆ వాహనాలను ఆర్‌బీకేల వద్ద సిద్ధంగా ఉంచుతాం. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఈ వాహనాల ద్వారా మిల్లులకు చేరవేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన రేటు ప్రకారం రవాణా చార్జీలు ప్రభుత్వమే చెల్లిస్తుంది.

– ఏవీ రాజేష్, ఎంపీఓ, కరప

యువతతోనే అవినీతికి అడ్డుకట్ట



విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కాకినాడ రూరల్: దేశంలో అవినీతిని అడ్డుకోవడం యువతతోనే సాధ్యమని విశ్రాంత డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు మేడపాటి వీర్రెడ్డి, ఓఎన్‌జీసీ హెచ్‌ఆర్ జీఎం సునీల్‌కుమార్, విజిలెన్స్ సీజీఎం సోమశేఖర్, సీనియర్ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ రాజేష్ పేర్కొన్నారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ్య ఎంఎస్ఎన్ సీపీ సెంటరులో ఓఎన్జీసీతో కలిసి సంయుక్తంగా విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ అధ్యక్షతన తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశ అభివృద్ధికి అవినీతి అడ్డురాకూడదని అతిథులు పేర్కొని ప్రతిజ్ఞ చేశారు.

కలెక్టరేట్ అటెండర్ మృతి

కాకినాడ క్రైం: కలెక్టరేట్‌లో అటెండర్ నరాల ప్రకాశరావు (62) జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. శారదాదేవి దేవాలయం జంక్షన్ వెనుక నివాసం ఉండే ఆయన గత నెల 30న ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగి ఇంట్లో ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి జీజీహెచ్‌లో చేర్చగా బుధవారం సాయంత్రం మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.6.23 కోట్లతో రహదారుల అభివృద్ధి



ఇంద్రపాలెం వద్ద రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ నుంచి పెదపూడి మండలం ఏపీ త్రయం, తూరంగి నుంచి కరప మండలం పెనుగుదురుకు రాకపోకలు సాగించే ఆర్ అండ్‌బీ రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు బుధవారం శంకుస్థాపనలు చేశారు. మొత్తం రూ.6.23 కోట్లతో నిర్మించనున్న రహదారులతో ప్రయాణికులకు వెతలు తప్పనున్నాయి. కన్నబాబు మాట్లాడుతూ ఇంద్రపాలెం నుంచి చీడిగ, కొవ్వాడ, రామేశ్వరం మీదుగా ఏపీ త్రయం వరకు సుమారు 7.2 కిలో మీటర్ల మేర రూ.3.35 కోట్లతో, జగన్నాథపురం బ్రిడ్జి నుంచి తూరంగి మీదుగా నడకుదురు నుంచి పెనుకుదురు వరకు 6.2 కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ రమేష్‌కుమార్, డీఈ వర్మ, ఏఈ లోవరాజు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై కమిషనర్ మండిపాటు

శానిటరీ సెక్రటరీ సస్పెన్షన్, ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్

కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు బుధవారం నగరంలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. 12వ సర్కిల్ పరిధిలోని గాంధీనగర్‌లో పర్యటించి సిబ్బంది పని తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరుపై మండిపడి, బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న 41 బి సచివాలయ శానిటరీ సెక్రటరీ కిరణ్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. 12 సర్కిల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవివర్మకు షోకాజ్ ఇవ్వాలని ఎంహెచ్ఓను ఆదేశించారు. పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రూ.20 లక్షలతో డ్రెయిన్ నిర్మాణం

కరప: గ్రామంలోని మెరకవీధి నుంచి అంబేడ్కరనగర్–2 మీదుగా నిర్మిస్తున్న డ్రైన్ నిర్మాణ పనులను జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు తదితరులు బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సూచనల మేరకు ఈ నిర్మాణాన్ని చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఎంపీపీ గ్రాంటు నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయగా, తన గ్రాంటు నుంచి మరో రూ.10 లక్షలు మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ పరిశీలనలో ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్, నక్కా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: జిల్లా మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకం కింద జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అండ్ స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ కాకినాడ కార్యాలయంలో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కాంట్రాక్ పద్ధతిన ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్టు జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారిణి కె.ప్రవీణ్ బుధవారం రాత్రి తెలిపారు. ప్రొటెక్షన్ అధికారి ఇనిస్టిట్యూషనల్ కేర్, ప్రొటెక్షన్ అధికారి నాన్ ఇనిస్టిట్యూషనల్ కేర్, కౌన్సిలర్ ఒకొక్క పోస్టుకు, సోషల్ వర్కర్ (మహిళ), అవుట్‌రీచ్ వర్కర్స్ రెండేసి పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను ధ్రువపత్రాలతో కలిపి మహిళా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలని పీడీ ప్రవీణ వివరించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

- ఈఆర్వో కిశోర్



వివిధ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఈఆర్వో కిశోర్

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 2,55,711 మంది ఓటర్లుగా నమోదయ్యారని ఈఆర్వో ఈట్ల కిశోర్ వెల్లడించారు. బుధవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో ఓటర్ల జాబితా ముసాయిదాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఓటర్లలో 1,27,044 మంది పురుషులు, 1,28,648 మంది మహిళలు, ఇతరులు 13 మంది ఉన్నారన్నారు. ముసాయిదా ప్రకారం ఓటర్ల మార్పులు చేర్పులకు డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరిచనున్నట్టు తెలిపారు. ఈనెల 4, 5 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నామని, 2024 జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన యువకులు ఓటర్లుగా నమోదు కావాలని కిషోర్ సూచించారు. రూరల్ తహసీల్దార్ వి.మురార్జీ, కరప తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబు, టి.నాగేశ్వరరావు, కె.కృష్ణమోహన్, ఎస్.అప్పారావు, టి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో ఓటర్ల ప్రత్యేక శిబిరాలు

కాకినాడ: ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం 4, 5 తేదీల్లో అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటరు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ ఈఆర్ఓ, కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో బుధవారం ఏఈఆర్వోలు, సూపర్వైజర్లు, బీఎల్ఓలతో ఓటర్ల జాబితా సవరణపై సమీక్షించారు. జాబితా ఆధారంగా ప్రజలకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే సరిచేయనున్నట్టు తెలిపారు. సిటీ పరిధిలోని 233 పోలింగ్ స్టేషన్లలో శిబిరాల్లో ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అర్హత కలిగిన కొత్త ఓట్ల నమోదు, ఓటర్ ఐడీలలో మార్పులు చేర్పుల కోసం వచ్చే దరఖాస్తులను కూడా స్వీకరించాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, తహసీల్దార్ సీతాపతి, ఏఈఆర్వోలు ఎంవీ మురళీకృష్ణ, హరిదాసు, నాగశాస్త్రులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నాగ నరసింహారావు

వలంటీర్లకు నియామకపత్రాల అందజేత

ప్రభుత్వ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమని కమిషనర్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన 16 మంది వలంటీర్లకు బుధవారం ఆయన నియామక పత్రాలు అందజేశారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించడంలో సమర్థంగా పనిచేయాలన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హాకీ కోచ్ రవిరాజు, హెచ్ఎం గౌరీశంకర్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): క్రీడల్లో రాణించే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎస్ఎస్ఆర్‌కె మున్సిపల్ పాఠశాల హెచ్ఎం డి.గౌరీశంకర్ పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య హాకీ ఎంపికల్లో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి పాఠశాల ఇంగ్లీష్ అసిస్టెంట్ కె.కృష్ణవేణి సౌజన్యంతో సమకూర్చిన హాకీ పరికరాలను బుధవారం పంపిణీ చేశారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు, హాకీ కోచ్ రవిరాజు అతిథిగా హాజరై అండర్–14 విభాగంలో కె.దుర్గాప్రసాద్, ఎం.నవ్య, అండర్–17 విభాగంలో పి.గోపి, ఎన్.రాజలహరిలను అభినందించారు. వీరికి రూ.10 వేలతో కొనుగోలు చేసిన హాకీ స్టిక్స్, టర్ఫ్‌షూస్, చిన్‌ప్యాడ్స్, స్టాగిన్స్ పరికరాలు హెచ్ఎం గౌరీశంకర్, రవిరాజు అందజేశారు. ఫస్ట్ అసిస్టెంట్ ఎ.పుష్ప, పీఈటీ ఎస్.సూరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

బాలాజీచెరువు: కాకినాడ రూరల్ కొవ్వాడ ఉన్నత పాఠశాలలో బుధవారం స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ డీఈఓ నాగమణితో కలసి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, కొడిగుడ్లు నిల్వగా ఉండటంతో వాటిని మార్చి కొత్తవి తీసుకురావాలని అదేశించారు. అలాగే గాంధీనగర్ అంగన్‌వాడీ సెంటర్, ఎల్విన్‌పేట, గంగనాపల్లి రేషన్‌షాపులను తనిఖీ చేశారు. అలాగే రాయుడుపాలెంలో రేషన్ బియ్యం పంపిణీ వాహనాన్ని తనిఖీ చేసి క్వింటా బియ్యం ఎక్కువగా ఉండడంతో 6ఏ కేసు నమోదు చేశారు.

9, 10 తేదీల్లో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఈ నెల 9, 10 తేదీల్లో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ జి.నాగమణి తెలిపారు. పోటీల వాల్‌పోస్టర్‌ను తన చాంబర్‌లో అవిష్కరించారు. కాకినాడ ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే ప్రతి పాఠశాల నుంచి ఒక ప్రాజెక్టు పాల్గొనేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస వినీల్, కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ నాగమణి, కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు

అక్షర క్రమం, అభివృద్ధిలోనూ ముందంజ



క్యాంపు కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు



నివాళులర్పిస్తున్న జెడ్పీ సీఈవో రమణారెడ్డి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో కిశోర్



ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాకినాడ రూరల్: అక్షర క్రమంలోనే కాదు అభివృద్ధిలోనూ ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు నడిపిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించి రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్రం విడిపోయిన తరువాత 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధిని గంగపాలు చేశారన్నారు. 2019లో అధికారంలో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ఆంధ్రుల అభివృద్ధి నిజమైన అభివృద్ధి అని చేటారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ళ సుబ్బారావు, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు చిన్నా, పెంకే ఆనందరావు, రమణయ్యపేట వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, గగారిన్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఈట్ల కిషోర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవతరణ వేడుకలు నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెదపూడి తహసీల్దార్ టి.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్: లయన్స్ ప్రొఫెషనల్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పీఆర్ కళాశాల వద్ద అమరజీవి విగ్రహానికి ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అడ్డాల సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లయన్స్ సభ్యులు ద్వారంపూడి విపుల్, నిమ్మకాయల వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతిరూపం పొట్టి శ్రీరాములు

కాకినాడ: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న పేర్కొన్నారు. స్థానిక బాలాత్రిపురసుందరి ఆలయం వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వెనుక ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పెద్ది రత్నాజీ, ఆర్యవైశ్య మహాసభ కాకినాడ అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాదం మధు, ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నాళం ఆండాళ్, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు) వైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాకినాడ లీగల్: కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉమ్మడి జిల్లా మార్కెట్ అండ్ ఆడిట్ రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై అమరజీవికి నివాళులు అర్పించారు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు టి.ప్రసాద్‌రెడ్డి, జి.రమ్యశ్రీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

కాకినాడ సిటీ: జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి అధ్యక్షతన బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. నవంబర్1, 1956న మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అవతరించిందని, అప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వ పండుగగా నవంబర్ 1న వేడుకలు నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రజాపరిషత్ కార్యాలయ పరిపాలనాధికారులు, ఏపీ పీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్, పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దేవులపల్లి జయంతి



దేవులపల్లికి నివాళులు అర్పిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: భావ కవి చక్రవర్తి దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి జయంతిని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద ఆయన విగ్రహానికి సాహిత్తవేత్త కె.గౌరీనాయుడు, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, న్యాయవాది శ్రీనివాసరావు, రెడ్నం రాజా తదితులు నివాళులర్పించారు. సామర్లకోట మండలం చంద్రంపాలెం గ్రామానికి చెందిన దేవులపల్లి 1897 నవంబరు 1న జన్మించారన్నారు. దేవులపల్లి ఆకాశవాణిలో గేయాలు, బాల గేయాలు, కార్మిక గీతాలు, భక్తి గీతాలను రచించి వినిపించారన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష రీ సర్వేకి సంబంధించి మండల సర్వేయర్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లతో బుధవారం ఆర్డీవో ఈట్ల కిషోర్ సమీక్షించారు. డివిజన్‌లో 129 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిన నేపథ్యంలో భూముల కచ్చిత విలువతో పాటు భూ హక్కు పత్రాల పంపిణీ వేగవంతం చేయాలని, రీ సర్వేపై వచ్చే అప్పీళ్లను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే బీబీ రాజు, అప్పారావు, కార్యాలయ పరిపాలనాధికారి జి.వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.